మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- నీళ్లు లేక ఎండిన పంటలు
- అప్పులు మీదపడటంతో తీవ్రమనస్తాపం
- భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో విషాదం

రాజయ్య (ఫైల్)

రేగొండ(గోరికొత్తపల్లి)/అక్కన్నపేట, ఏప్రిల్ 15 : సాగుకు నీళ్లు లేక పంటలు ఎండిపోవడంతో తీవ్రమనస్తాపం చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటనలు జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేటకు చెందిన బోలవేని రాజయ్య(55) తనకున్న మూడెకరాల్లో పత్తి, మక్కజొన్న సాగు చేశాడు. పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. ఈ ఏడాది సరిగా పంటలు పండక, పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర దక్కలేదు. దీంతోపాటు యాసంగిలో సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి. పంట కోసం తెచ్చిన సుమారు రూ.5 లక్షలకుపైగా అప్పులు ఎలా తీర్చాలో తెలియక కుంగిపోయాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

తుర్కవానికుంటలో రైతు శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామ పరిధిలోని తుర్కవానికుంటకు చెందిన రైతు బోడ శ్రీనివాస్ రెడ్డి(40) గతంలో దుబాయ్‌కి వెళ్లి తిరిగి స్వగ్రామం వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. తనకున్న ఐదెకరాల్లో ఇటీవల నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. దీనికితోడు నీరందక వేసిన పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. తిరిగి మళ్లీ దుబాయ్ వెళ్లేందుకు సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలానికి చెందిన ఓ ఏజెంట్‌కు రూ. 4 లక్షలు ఇచ్చాడు. సదరు వ్యక్తి దుబాయ్‌కి పంపించకుండా కాలయాపన చేశాడు. తిరిగి డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తే రేపు, మాపంటూ వాయిదాలతో కాలం వెళ్లదీశాడు. చివరికి గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్‌రెడ్డికి అప్పటికే సుమారు రూ. 15 లక్షల వరకు ఉన్న అప్పుల భారం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్ రాశాడు. తనను మోసం చేసిన ఏజెంట్‌ను వదిలి పెట్టవద్దని, తన కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేయొద్దని లేఖలో రాశాడు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సబిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు.

ధాన్యం ఆరబోస్తూ.. గుండెపోటుతో రైతు మృతి

జగిత్యాల జిల్లా దూలూర్‌లో విషాదం

జలపతిరెడ్డి (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 15 : కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని ఆరబోస్తూ కుప్పకూలి ఓ రైతు గుండెపోటుతో మృత్యువాతపడ్డాడు. ఈ విషాదకర ఘటన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలూర్ గ్రామానికి చెందిన రైతు పూండ్ర జలపతిరెడ్డి(50) గ్రామ శివారులోని కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మంగళవారం ఉదయం వెళ్లాడు. ధాన్యాన్ని ఆరబోస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గుండెపోటు వచ్చిందని గమనించిన అక్కడున్న రైతులు సీపీఆర్ చేసి, చికిత్స కోసం కథలాపూర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అకాల వర్షం... అపార నష్టం

రోజులతరబడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

ఖమ్మం జిల్లా పుల్లయ్యబంజరలో రైతుల దయనీయ స్థితి

- కొనుగోళ్లపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ, పట్టింపులేని తనం..
- రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పుల్లయ్యబంజర కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం, ఏప్రిల్ 15 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రెండు రోజుల క్రితం గాలివాన సృష్టించిన బీభత్సం ఎన్నో కుటుంబాలను అగాధంలోకి నెట్టింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం కల్లాల్లో చూసుకుని ఇక తమ కష్టాలు తప్పుతాయని భావించిన కొద్దిసేపట్లోనే అకాల వర్షం ఆ కుటుంబాల ఆశలను అడియాశలు చేసింది. స్వేదం చిందించి పండించిన వరి ధాన్యం కళ్లముందు తడిసి ముద్దకావడంతో భీతిల్లిపోయారు. ఇది ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పుల్లయ్యబంజర, లోకారం గ్రామాలకు చెందిన రైతుల దీనస్థితి. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో కురిసిన వర్షం వేలాది ఎకరాల్లో పంట నూర్చి కుప్పలుగా వేసిన ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో పుల్లయ్యబంజరకు చెందిన బొల్లం రామయ్య, చంద్రకళ దంపతులు కళ్లముందు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూసి కన్నీంటి పర్యంతమయ్యారు. గత సంవత్సరం కంటే ధాన్యం దిగుబడి కొంత పెరిగిందని సంతోషించి క్షణకాలం కాకముందే ఈ పరిస్థితి దాపురించడంతో దేవుడిపై భారం వేయడం తప్ప మరేం చేయలేని పరిస్థితి నెలకొందంటూ వాపోయారు. ధాన్యం కల్లాల్లో ఆరబోసి పది రోజులైనా తమ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే పరిస్థితి పుల్లయ్యబంజరలో అనేక మంది రైతులది. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోలేక, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టించుకునేవారు లేక తమ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారిందని, ప్రకృతి ఏ క్షణంలో ప్రకోపిస్తుందో తెలియక ఆరబోసిన ధాన్యం ముందు కేంద్రాల అధికారుల పిలుపు కోసం నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో జిల్లాలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేతల చేతుల్లోకి గన్నీ బ్యాగులు వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలను వారు శాసించే పరిస్థితి నెలకొన్నది. రైతులకు ప్రాధాన్యం ఇవ్వకుండా తమ పార్టీ వారికి బస్తాలు ఇవ్వడం, ధాన్యం కొనుగోలుకు ఆంక్షలపై అధికారులు మౌనం వీడకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తడిచిన ధాన్యం కొనాల్సిందే: సండ్ర

అకాల వర్షంతో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పుల్లయ్యబంజర కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రైతులతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత కల్లూరు మండలం పుల్లయ్యబంజర, తల్లాడ మండలం గొల్లగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి పరిశీలించారు. పుల్లయ్యబంజర కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిచిన రైతులతో మాట్లాడారు. అనంతరం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గన్నీ సంచులు కాంగ్రెస్ నాయకులు ఇష్టమైన వారికి ఇస్తున్నారని, మండలంలోని ఓ గ్రామంలో ఖాళీ సంచుల కోసం కాంగ్రెస్ నాయకులు అధికారుల ఎదుటే ఘర్షణ పడ్డారని తెలిపారు. ముగ్గురు మంత్రులున్నా జిల్లాకు ఉపయోగం లేదని మండిపడ్డారు.

వర్షంతో ధాన్యం కొట్టుకుపోయింది..

వరి కోసి కల్లాల్లో ధాన్యం ఆరబోసి 20 రోజులైంది. మిల్లర్ల ఎంపికలో జాప్యం, అకాల వర్షంతో ధాన్యమంతా వరద పాలైంది. తేమ, తరుగు అంటూ ఆలస్యం చేశారు. కేంద్రాల్లో దళారులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో రైతులను చులకనగా చూస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సింది పోయి కాలయాపన చేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. రైతుల బాధ మరెవరికీ రాకూడదు.

–చంద్రకళ, మహిళా రైతు, కల్లూరు

పండిన పంట నీటిపాలు

చేతికొచ్చిన ధాన్యం వరదపాలైంది. వెయ్యి బస్తాల వరకు వరద ధాటికి కొట్టుకుపోయింది. మిగిలిన వడ్లన్నీ తడిశాయి. ఈ వడ్లు ఎండేదెప్పుడు.. కొనేదెప్పుడు. పూర్తిగా ఎండిన వడ్లు కొనడానికే అష్టకష్టాలు, ఇబ్బందులు పెడుతున్నరు. ఈ వడ్లు కొనాలంటే ఇంకెన్ని రోజులు ఇబ్బందులు పెడ్తరో. అధికారులు చొరవ తీసుకొని వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప ఇప్పట్లో అయ్యే పని కాదు. ఇన్నేళ్లలో ఇంత ఇబ్బంది ఎన్నడూ పడలేదు.

– బొల్లం రామయ్య, రైతు, కల్లూరు

మరో మూడు రోజులు వర్షాలు

- రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగొచ్చు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వానలు కురువొచ్చని వెల్లడించింది. బుధవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ –మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని పేర్కొంది. 17న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్లతో కూడిన వానలు కురిసినట్లు వెల్లడించింది. మరోవైపు ఈ నెల 17 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే వారం రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని అంచనా వేసింది.

మూసాపేట మండలం వేములలో ఈదురుగాలుకు ఇనుపడబ్బా మీదపడి మృతి చెందిన మహిళ

వడగండ్లు.. కడగండ్లు

గాలివాన బీభత్సంతో నేలరాలిన ధాన్యం

ఇనుప డబ్బా మీదపడి మహిళ మృతి

నవాబ్‌పేట/కల్వకుర్తి/వెల్దండ/మూసాపేట, ఏప్రిల్ 15 : మహబూబ్‌నగర్ జిల్లా రుద్రారం, కొండాపూర్, చాకలిపల్లి, కేశవరావుపల్లి, బట్టోనిపల్లితండాలో మంగళవారం కురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి ధాన్యం నేలరాలి అన్నదాతకు తీవ్రనష్టం వాటిల్లింది. రుద్రారంలో 70 ఎకరాలు, కొండాపూర్‌లో 40 ఎకరాలు, చాకలిపల్లిలో 50 ఎకరాలు, కేశవరావుపల్లిలో 30 ఎకరాలు, బట్టోనిపల్లితండాల్లో 40 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మూసాపేట మండలం వేములకు చెందిన అయ్యమ్మ (50) తన పొలంలో పండించిన వరి ధాన్యంను వేముల శివారులోని కొజెంట్ పరిశ్రమ వద్ద ఉన్న రోడ్డుపై ఆరబోసింది. వర్షం రావడంతో ధాన్యం కుప్పకట్టింది. ఈదురు గాలులు, వర్షంతో ఆమె వాటి నుంచి తప్పించుకునేందుకు వెళ్తుండగా ఓ ఇనుప డబ్బా గాల్లో పల్టీలు కొడుతూ వచ్చి ఆమెపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర పరిధిలో వడగండ్ల వానతో వరి పంటలు దెబ్బతిన్నాయి. ఆకుతోటబావి, మర్రిగడ్డ, మేరోనిగడ్డ, నక్కరి చెరువులో 80 ఎకరాల్లో వరిపంటకు నష్టం చేకూరింది.

వరంగల్ జిల్లా ఖానాపురంలో జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పంట నష్టంపై వెంటనే సర్వే చేయాలి

- ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి
- జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

ఖానాపురం, ఏప్రిల్ 15 : వడగండ్ల వానకు జరిగిన పంట నష్టంపై వెంటనే సర్వే చేసి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్ జిల్లా ఖానాపురంలో జాతీయ రహదారిపై రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అకాల వర్షానికి పాకాల ఆయకట్టులో వరి, మక్క పంటలు దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన పంటల సర్వే చేపట్టాలని వ్యవసాయ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు తక్షణమే పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.25వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని కోరారు. ఎస్సై రఘుపతి సిబ్బందితో చేరుకుని తహసీల్దార్ కిరణ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. రేపటి నుంచే సర్వే చేయిస్తామన్న తహసీల్దార్ హామీతో రైతులు రాస్తారోకో విరమించారు.

జూరాల ఆయకట్టు రైతుల పోరుబాట

- డ్యాం వద్ద బైఠాయించిన 200 మంది
- 24 గంటల్లో సాగునీళ్లు ఇవ్వాలని డిమాండ్
- లేదంటే తమకు చావే శరణ్యమని హెచ్చరిక

వనపర్తి జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ మోటర్ల వద్ద రాత్రి పూట పడిగాపులు కాస్తున్న రైతులు

అమరచింత, ఏప్రిల్ 15 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులు పోరుబాట పట్టారు. మస్తీపూర్, నందిమళ్ల, సింగంపేట, మూలమల్ల తదితర గ్రామాలకు చెందిన 200 మంది రైతులు డ్యాం వద్దకు చేరుకొని ప్రధాన రహదారిపై బారికేడ్లతో పాటు ముళ్లకంపలు అడ్డంగా వేసి గంటసేపు బైఠాయించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జూరాల ప్రధాన ఎడమ కాల్వ పరిధిలో 35 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశామన్నారు. పంట చేతికందాలంటే ఇంకా రెండు వారాల పాటు సాగునీళ్లు వదలాలని, లేదంటే పంటలు ఎండిపోయి పెట్టుబడికి తెచ్చిన అప్పు మీదపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పంటలు ఎండితే తమకు చావే శరణ్యమని హెచ్చరించారు. ఎమ్మెల్యే శ్రీహరి వచ్చి స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. ససేమిరా అనడంతో వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా ఆత్మకూర్ మండలం అరెపల్లి, కత్తెపల్లి, గుంటిపల్లి, మోట్లంపల్లి గ్రామాల రైతులు సాగునీరు ఎప్పుడిస్తారని మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు జూరాల ఎడమ కాల్వ మోటర్ల వద్ద పడిగాపులు కాశారు. ప్రాజెక్టు వద్ద కనిపించిన వారందరినీ సాగునీటి కోసం వేడుకున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వందసార్లు ఫోన్లు చేసినా ఎత్తడంలేదని రైతులు వాపోయారు. పంటలు ఎండుతుంటే తిన్న కూడు తిండి ఒంటికి పట్టడంలేదని దిగాలుచెందారు. నీళ్లు ఎప్పుడు అందుతాయా..? అంటూ అక్కడే వేచిఉన్నారు.

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బకెట్లతో ధర్నా చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం పంచాయతీ ఆఫీస్ ముట్టడి

ఖాళీ బకెట్లతో మహిళల ఆందోళన

రెంజల్, ఏప్రిల్ 15 : తాగునీటి కోసం రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో మహిళలు బకెట్లతో పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో సుమారు రెండు వందల కుటుంబాలు ఉండగా, బోరు ఎత్తిపోవడంతో రెండు నెలలుగా తాగునీటి కోసం నానా కష్టాలు పడుతున్నట్టు వారు తెలిపారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మహిళలు ఆందోళన చేస్తుండగా.. జీపీలో ఉన్న కార్యదర్శి నవీన్ తనకేమీ పట్టనట్టుగా అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోవడం గమనార్హం.

దివంగత శాస్త్రవేత్త అశ్వినికి

అరుదైన గౌరవం

పూస శనగ-4027 రకానికి అశ్విని పేరు పెట్టిన ఐసీఏఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త నూనావత్ అశ్వినికి అరుదైన గౌరవం దక్కింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారంతండాకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త నునావత్ అశ్విని నిరుడు వరదల్లో మృతిచెందిన విషయం తెలిసిందే. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ(ఐసీఏఆర్) కొత్తగా అభివృద్ధి చేసిన పూస శనగ-4037 రకానికి అశ్విని పేరు పెట్టి అరుదైన గౌరవం ఇచ్చింది. సోమవారం ఢిల్లీలో ఈ కొత్త వంగడాన్ని విడుదల చేశారు. హెక్టారుకు 36.4 క్వింటాళ్ల దిగుబడినిచ్చే కొత్త శనగ రకానికి ఐసీఏఆర్ అశ్విని పేరు పెట్టడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అశ్విని పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ శాస్త్రవేత్తగా ఉద్యోగం సాధించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట కుడికాలువ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కుడికాలువ పనులను అడ్డుకున్న రైతులు

పరిహారం చెల్లించాకే పనులు చేయాలని డిమాండ్

కోనరావుపేట, ఏప్రిల్ 15 : రాజన్న సిరిసిల్ల జిల్ల కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ ప్యాకేజీ-9లో భాగంగా నిర్మిస్తున్న కుడికాలువ పనులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. పరిహారం అందించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశా రు. వివరాల్లోకి వెళితే.. మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ పనులు పూర్తి చేసి చెరువులు, కుంటలు నింపే విధంగా అధికారులు మిగిలిన కాలువ పనులు చేపట్టారు. కాలువ ద్వారా మల్కపేట ఊర చెరువు నింపితే 50 మంది రైతుల 40 ఎకరాల భూములు నీట మునిగిపోతాయి. చెరువులో మునిగిపోయే పట్టా భూములకు పరిహారం అందించడంతోపాటు జీవనాధారం చూపించాలని సంబంధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెరువుల్లో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించేందుకు వీలులేదని, భూములు నష్టపోకుండా కాలువ దగ్గర గేట్ ఏర్పాటు చేస్తామని అధికారులు సూచించినా వినకపోవడం తో పోలీసు బలగాలను దించి పనులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఈఈ కిశోర్‌ను వివరణ కోరగా చెరువులో భూములు కోల్పోయినవారికి ఎక్కడా పరిహారం అందించలేదని చెప్పారు. 200 మీటర్ల పనులు పూర్తయితే కుడి కాలువ ద్వారా చెరువులు, కుంటలు నిండి సాగునీ రందుతుందని పేర్కొన్నారు.

పసుపు @ రూ.15 వేలు

ఈ సీజన్‌లో ఇదే రికార్డు

మెట్‌పల్లి, ఏప్రిల్ 15 : పచ్చ బంగారంగా పిలుచుకునే పసుపునకు ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో ధర పెరుగుతున్నది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పసుపునకు పలికిన ధరలిలా ఉన్నాయి. పసుపు కాడి (కొమ్ము) రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15 వేలు, కనిష్ఠంగా రూ.9,111, గోళ (మండ) రకానికి గరిష్ఠంగా రూ.13,388, కనిష్ఠంగా రూ.9,002, చూర రకానికి గరిష్ఠంగా రూ.10,511, కనిష్ఠంగా రూ.7,796 ధర పలికింది. కాగా కాడి, గోళ రకాలకు ఈ సీజన్‌లో ఇప్పటివరకు పలికిన ధరల్లో ఇదే అధికం కావడం విశేషం. అయితే, ఇవే ధరలు కొనసాగుతాయా? మళ్లీ తగ్గుముఖం పడుతాయా? అనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికే రైతుల దగ్గరి నుంచి 80 శాతానికి పైగా పసుపు అమ్మకం జరిగి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. రైతుల నుంచి భారీగా పసుపు రాగా కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని పలుమార్లు రైతులు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. మెజార్టీ శాతం పసుపు అమ్మకం పూర్తయ్యాక ధర పెరగడం వల్ల ఒరిగే ప్రయోజనం లేదని రైతులు పేర్కొంటున్నారు.

దుబాయిలో ఇద్దరు తెలంగాణవాసుల హత్య

- ఆర్మూర్ వాసికి తీవ్ర గాయాలు
- దారుణానికి పాల్పడిన పాకిస్థానీ

ప్రేమ్‌సాగర్ (ఫైల్)

హైదరాబాద్, సోన్, ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 15: బతుకుదెరువు కోసం పొట్టచేతబట్టుకొని దుబాయికి వెళ్లిన తెలంగాణవాసులు హత్యకు గురయ్యారు. ఉన్న ఊరిని.. కన్నవారిని వదిలి నాలుగు రాళ్లు సంపాదించుకునేందుకు వెళ్లినవారు పాకిస్థానీయుల దురాగతానికి బలయ్యారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లాలోని సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్(40), జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన దేగం సాగర్ ఉపాధి నిమిత్తం కొన్నేండ్ల కిందట దుబాయికి వెళ్లారు. స్థానిక బేకరీలో పని చేస్తున్నారు. అయితే, శుక్రవారం విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు దుండగులు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్‌లపై దాడి చేసి, దారుణంగా హత్య చేశారు. పారిపోయేందుకు ప్రయత్నించిన దేగం సాగర్‌పైనా దాడికి పాల్పడ్డారు. ఆయన తీవ్రంగా గాయపడగా.. పోలీసులు, సహోద్యోగులు సాగర్‌ను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం సాగర్ చికిత్స పొందుతున్నారు. నిందితులు మతపరమైన నినాదాలు చేస్తూ ఈ దారుణానికి ఒడిగట్టినట్టు సమాచారం. కాగా, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్‌ల మృతితో వారి స్వగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. క్షతగాత్రుడు దేగం సాగర్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రమంత్రి జైశంకర్‌కు కిషన్‌రెడ్డి లేఖ

శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్‌ల మృతదేహాలను వెంటనే స్వదేశానికి రప్పించాలని కోరుతూ కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ అంశంపై జైశంకర్ వెంటనే స్పందించారని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు దుబాయిలోని భారత కాన్సులేట్ అధికారులు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. హత్య కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక సిద్ధం కానందున మృతదేహాలు తరలించడానికి మరికొంత సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పాలిసెట్‌కు తగ్గిన దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ పాలిసెట్‌కు ఈ ఏడాది దరఖాస్తులు తగ్గాయి. నిరుడు 92 వేల దరఖాస్తులు రాగా, మంగళవారం వరకు 79 వేల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 77 వేల మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఈ నెల 19న దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనున్నది. రూ.100 అపరాధ రుసుముతో 21వరకు, రూ.300 అపరాధ రుసుముతో 23 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశమున్నది.

20లోగా 'సీసీఈ మార్కులు' ఎంట్రీ చేయాలి

హైదరాబాద్, ఏప్రి